
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
బుధవారం 3 జనవరి 2024



9 న సదరం క్యాంపు.. రేపు స్లాట్లు బుకింగ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 1: సంగారెడ్డి జిల్లాకు సంబంధించి దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును ఈ నెల 9వ తేదీన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్లు ఈ నెల 4వ తేదీన కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు మీ సేవా ద్వారా స్లాట్ బుక్ చేసుకుని స్లాట్ రసీదు, మెడికల్ రిపోర్టులతో క్యాంపుకు హాజరుకావాలని ఆమె సూచించారు.

బంకుల వద్ద బారులు

ట్రక్కు డ్రైవర్ల సమ్మె నేపథ్యంలో మంగళవారం పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులుతీరారు. మూడ్రోజులు సమ్మె కొనసాగుతుందని వార్తలు రావడంతో పెట్రోల్ పోయించుకోవడానికి ఎగబడ్డారు. దీంతో మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పట్టణాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. పలు బంకులు నోస్టాక్ బోర్డును పెట్టాయి.


హత్నూర మండలం దౌల్తాబాద్‌లో..


నర్సాపూర్‌లో..


సంగారెడ్డిలో..


సంగారెడ్డి మండలం అంగడిపేటలో మూతపడిన ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల

మూతబడి

విద్యార్థులు రాక ప్రభుత్వ పాఠశాలలకు తాళం

సంగారెడ్డి జిల్లాలో 47 పాఠశాలలు మూత

విద్యాశాఖ నిర్లక్ష్యమేనంటూ ఆరోపణలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 : ప్రభుత్వ బడికి వెళ్లేందుకు ఆ ప్రాంతాల్లో విద్యార్థులే లేరా? ఉన్నా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారా? లేక సర్కారు బడిలో చేర్పించేలా బడిబాట సక్రమంగా నిర్వహించలేదా? సర్కారుబడికి వచ్చేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది ప్రోత్సహించడం లేదా?... కారణాలేమైనా సంగారెడ్డి జిల్లాలో పదుల సంఖ్యలో సర్కారు బడులు మూతపడుతున్నాయి. జిల్లాలో 47 పాఠశాలల్లో విద్యార్థులు లేరంటే ఆశ్చర్యం కలగకమానదు. స్కూలుకు వచ్చే పిల్లలు లేక ఆయా పాఠశాలలకు తాళాలుపడ్డాయి. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను వేరే స్కూళ్లకు డిప్యూటేషన్‌పై పంపారు. జిల్లాలోని సంగారెడ్డి, హత్నూర, ఝరాసంగం, కల్హేర్, కోహీర్, కొండాపూర్, మనూర్, మునిపల్లి, నారాయణఖేడ్, నిజాంపేట, న్యాల్‌కల్, రాయికోడ్, సిర్గాపూర్, వట్‌పల్లి తదితర మండలాల్లో ఒక్కో మండలంలో ఒకటి నుంచి ఐదేసి స్కూళ్ల వరకు ఇలా మూతపడ్డాయి. ఇందులో ఎక్కువగా ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. పదిహేను రోజుల కిందట జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో సంగారెడ్డి మండలం అంగడిపేటలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. విద్యార్థులు రావడంలేదని ఏకంగా ఆ పాఠశాలలో పనిచేసే ఒకేఒక ఉపాధ్యాయుడు సంగారెడ్డి మండల విద్యాశాఖ అధికారికి లేఖ రాశారు. బడులు మూతపడడానికి విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. కాగా, రెండ్రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులు లేని బడంటూ ఉండకూడదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్యార్థులు లేక మూతబడిన ఆయా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు జిల్లా విద్యాశాఖ ఏం చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉన్నది.

ఆ పాఠశాలలను తెరిపించడానికి చర్యలు

జిల్లాలోని 47 సర్కారు బడుల్లో విద్యార్థులు రాకపోవడంతో మూతపడ్డాయి. మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, సీఆర్పీల ద్వారా ఇంటింటి సర్వేకు చేయించి విద్యార్థులు బడిలో చేరేలా చర్యలు తీసుకుంటాం.

- ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి జిల్లా

కొత్త ఆశలు..

నిజాం షుగర్స్ ప్రారంభంపై ప్రభుత్వ సానుకూలత

ఇటీవల శాసన మండలిలో ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి
సీఎం హామీపై కార్మికుల హర్షం
ఘన చరిత్ర కలిగిన నిజాం చక్కెర కర్మాగారం
చెరకు రైతుకు ఆదెరువు
మెదక్‌లో 1988లో ఏర్పాటు
2002లో ప్రైవేటీకరణ
క్రమంగా నష్టాల ఊబిలోకి
స్వరాష్ట్రంలోనూ మారని తీరు
2015లో మూసేసిన సర్కారు
కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు


మెదక్ మంబోజిపల్లిలో మూతపడిన నిజాం చక్కెర కర్మాగారం

7లో

మాట నిలుపుకుంటాం.. అదే మా నైజం


జసంతాపూర్‌లో ప్రజాపాలనలో దరఖాస్తు స్వీకరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

- ప్రజల వద్దకే ప్రభుత్వం
- సమస్యలు పరిష్కరించడానికే ప్రజాపాలన
- 100 కుటుంబాలకో కౌంటర్
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం
- ఇషాంత్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

7లో

జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి

- సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 2: సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఈ నెల 8,9,10 వ తేదీల్లో జరిగే జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సంగారెడ్డి డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌పై సన్నాహక సమావేశాన్ని శనివారం సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, అగ్రికల్చర్, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్‌పోర్ట్, కంప్యూటేషనల్ థింకింగ్ తదితర అంశాలపై విద్యార్థులు ఎగ్జిబిట్స్ ప్రదర్శించాలని తెలిపారు. సమన్వయంతో సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో వెంకటనర్సింలు, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఎగ్జిబిషన్ నిర్వాహక కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతనోత్తేజంతో పనిచేద్దాం

- టీఎన్జీవోలతో మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 2: కొత్త సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి నూతనోత్తేజంతో పనిచేద్దామని టీఎన్జీవో ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, డీఆర్వో పద్మశ్రీ, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్‌లకు తన బృందంతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, మాజీ అధ్యక్షులు శ్యామ్‌రావు, బట్టి రమేష్, మనోహర్, ఇక్బాల్‌పాష, ఫజులొద్దిన్, విష్ణువర్ధన్ రెడ్డి, మెదక్, నర్సాపూర్ యూనిట్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివాజీ, శేషాచారి, రామాగౌడ్, సంగమేశ్వర్, తులసీరాం, శివరాం, జయ్‌రాజ్, విక్రమ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



హత్యాయత్నం కేసులో ఒకరికి రిమాండ్

జహీరాబాద్, జనవరి 2 : జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామంలో ఇద్దరు వ్యక్తులను చాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని పట్టణ సీఐ రాజు, ఎస్‌ఐ నరేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 31న సత్వార్ గ్రామానికి చెందిన కల్పగూర్ నర్సింలు, బొమ్మె యోగేష్, బొమ్మె జనార్దన్, బీళ్ల గుండప్ప, బీళ్ల హరిక్రిష్ణ కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. బొమ్మె జనార్దన్ ఇంటి ముంగిట చలిమంట వేసుకుని కూర్చున్నారన్నారు. ఇంతలో ఏర్పుల నర్సింలు అక్కడికి వచ్చి చలిమంటపై దూకుతూ అక్కడ ఉన్న వారిని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో బొమ్మె యోగేష్ ఎందుకిలా చేస్తున్నావంటూ ఏర్పుల నర్సింలును మందలిస్తున్న క్రమంలో అక్కడే ఉన్న కల్పగూర్ నర్సింలు విడిపించి సర్దిచెప్పి ఏర్పుల నర్సింలును ఇంటికి పంపిచాడు. అనంతరం ఏర్పుల నర్సింలు తన ఇంట్లో ఉన్న చాకుతో వచ్చి బొమ్మె యోగేష్‌తో మళ్లీ గొడవ పెట్టుకుని మెడపై, కాలుపై కత్తితో గాయాలు చేశాడు. మధ్యలో వచ్చిన కల్పగూర్ నర్సింలును కత్తితో పొడవడమే కాకుండా మెడపై, కడుపుపై నోటితో గాయపరిచి పారిపోయాడు. కల్పగూర్ నర్సింలు చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం హత్యాయత్నం చేసిన ఏర్పుల నర్సింలును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుచగా 14రోజులు రిమాండ్‌కు పంపించారు.

బిల్లులను విడుదల చేసి మధ్యాహ్న భోజన వంటకార్మికులను ఆదుకోవాలి

● ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య

చిన్నశంకరంపేట, జనవరి 2: గతేడాది సెప్టెంబరు నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయకపోవడంతో వంట కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బిల్లును విడుదల చేసి ఆదుకోవాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నశంకరంపేట విలేకర్ల సమావేశంలో ఎస్టీయూ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వంట కార్మికులు అప్పు తెచ్చి వంటలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు చాలీచాలని వేతనాలకు వంటలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా స్కావేంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

సంగారెడ్డి క్రైం, జనవరి 2 : భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా గృహిణి మంగళవారం నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన జంగంగారి శిరీష(36) తన భర్త కృష్ణ మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం శిరీష మండల పరిధిలోని ఫసల్‌వాది వద్ద ఉన్న శివ్వంపేట బ్రిడ్జి నుంచి నదిలోకి దూకడానికి యత్నించింది. అదే సమయంలో అక్కడి నుంచి వెళ్తున్న సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్ గమనించి ఆమెను రక్షించారు. అనంతరం డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం ఘటనా స్థలానికి చేరుకొని ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఇంటికి పంపించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుమ్మడిదల, జనవరి 2 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన అన్నారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న కానుకుంట కుమార్(40) భార్యతో గొడవ కారణంగా విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కుమార్ మంగళవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జింకను కాపాడిన పోచారం గ్రామస్థులు

రేగోడు, జనవరి 2: మండలంలోని పోచారం సమీపంలో ప్రధాన రహదారిపై కృష్ణజింకను కుక్కలు వెంబడించి దాడి చేశాయి. అటుగా వెళుతున్న ప్రయాణికులు, గ్రామస్థులు కుక్కలను తరిమేసి జింకను పోచారం గ్రామానికి తీసుకొచ్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రాజయ్య కృష్ణజింకకు రేగోడు వెటర్నరీ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి కృష్ణజింకను అప్పగించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిలప్‌చెడ్, జనవరి 2: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ షేక్ మహమ్మద్ సూచించారు. మంగళవారం మండలం పరిధిలోని గౌతాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఆదేశాను సారం కళాబృందంతో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మూఢనమ్మకాలు తదితర అంశాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, హెడ్‌కానిస్టేబుల్ సురేందర్, హోమ్‌గార్డులు జనార్దన్, ఇసాక్, షీటీం బృందం తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకుంటాం.. అదే మా నైజం

- ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించడానికే ప్రజాపాలన
- 100 కుటుంబాలకో కౌంటర్
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో ప్రజాపాలన ధరఖాస్తు స్వీకరిస్తున్న మంత్రి దామోదర్

నారాయణఖేడ్, జనవరి 2: ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ నైజమని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేట, ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నమే చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా మీసేవ కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలు పరిష్కరించడానికే ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథకాల అమలకు కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, మిగిలినవాటికి ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి అమలు చేస్తామన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాపాలన ధరఖాస్తుల స్వీకరణకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 100 కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేయించామని మంత్రి తెలిపారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం వరకు లక్ష ధరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ప్రజాపాలన గ్రామసభలు ఈ నెల 6తో పూర్తయినప్పటికీ ఆ తరువాత కూడా అర్హులైనవారు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయ వచ్చని తెలియజేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నల్లవాగు ఆయకట్టు లైబంది నిర్వహించి సాగునీటిని విడుదల చేయాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. సమావేశాల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఎఫ్‌వో శ్రీధర్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, ఆర్డీవో వెంకటేష్, ఎంపీపీ చాందీబాయి, సర్పంచ్‌లు దత్తు, సతీష్, ఎంపీటీసీ లక్ష్మి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, వివేకానంద్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వసతులు, పరికరాలు, సిబ్బంది నియామకానికి ప్రాధాన్యమిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తామని తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంతంలో వైద్య సేవలను విస్తరింప చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు తొలిసారి నారాయణఖేడ్‌కు వచ్చిన మంత్రికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, జిల్లా కలెక్టర్ శరత్, ఏరియా వైద్యశాలల కోఆర్డినేటర్ సంగారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి గాయత్రిదేవి, వైద్య శాల సూపరిండెంట్ వెంకటలక్ష్మి, సేవాలాల్ సంఘం నాయకులు రమేష్ చౌహాన్, తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటాం

- అమరుల కుటుంబాలను ఆదుకుంటాం
- ఇషాంత్‌రెడ్డి కుటుంబానికి ఇంటి స్థలం
- అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం
- ఇంటింటికి సంక్షేమ ఫలాలను అందజేస్తాం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

న్యాల్‌కల్, జనవరి 2: తెలంగాణ ఏర్పాటు కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం బసంతాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తెలంగాణ అమరవీరుడు ఇషాంత్‌రెడ్డిని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారుల సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పారు. అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఆత్మార్పణం చేసుకున్న ఇషాంత్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని, వారికి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని తెలిపారు.

మాది ప్రజా ప్రభుత్వం

తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజల సమస్యలను తెలుసుకుని అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం కోసం అధికార యంత్రాంగం ప్రజల చెంతకే వచ్చి ధరఖాస్తులు తీసుకుంటున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్‌ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడం ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన పథకాలకు అర్హులైన ప్రతీ ఒక్కరు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ధరఖాస్తులు చేసుకున్నవారికి మంత్రి చేతుల మీదుగా రసీదులను అందజేశారు. అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలనె అమలను చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శరత్, మాజీమంత్రి చంద్రశేఖర్, సురేష్‌కుమార్ షెట్కార్, మండల పార్టీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


బసంతాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

కొత్త ఆశలు..

నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభంపై ప్రభుత్వ సానుకూలత

- ఇటీవల శాసన మండలిలో ప్రస్తావించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీఎం హామీపై కార్మికుల హర్షం
- ఘన చరిత్ర కలిగిన చక్కెర కర్మాగారం
- మెదక్‌లో 1988లో ఏర్పాటు
- 2002లో ప్రైవేటీకరణ
- క్రమంగా నష్టాల ఊబిలోకి
- స్వరాష్ట్రంలోనూ మారని తీరు
- 2015లో మూసేసిన సర్కారు
- కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు


శిథిలమవుతున్న ఉద్యోగుల నివాసాలు

మెదక్, జనవరి 2 : మూతబడ్డ నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి శాసనమండలి సభలో ప్రకటించడంతో కార్మిక కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో చరకు పంటకు వెన్నుదన్నుగా నిలువడంతో పాటు ఎంతోమందికి ఉపాధి కల్పించిన నిజాం చక్కెర కర్మాగారాలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా క్రమంగా మూతపడ్డాయి. కార్మికులు రోడ్డునపడ్డారు. ప్రైవేటు ఫ్యాక్టరీల ఆగడాలు భరించలేక రైతులు చెరకు పంట వేయడం తగ్గించేశారు. ప్రస్తుతం సీఎం హామీతో మరోసారి నిజాం షుగర్స్‌పై ఆశలు చిగురిస్తున్నాయి.

మెదక్‌లో ఎన్ఎస్ఎఫ్ ప్రస్థానం

1988లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లాకు చెందిన మంత్రి కరణం రాంచందర్‌రావు చొరవతో మెదక్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మంబోజిపల్లిలో నిజాం షుగర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్రారంభించారు. చుట్టుపక్కల 12 మండలాల రైతులు తాము పండించిన చెరుకును ఈ ఫ్యాక్టరీలో గానుగ ఆడించేందుకు తీసుకువచ్చేవారు. వందల సంఖ్యలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభించింది.

ప్రవేటీకరణ నేపథ్యం

ప్రభుత్వం రంగంలో పనిచేస్తున్న నిజాం ఫ్యాక్టరీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయని 2002లో ప్రవేటీకరణకు పూనుకున్నారు. ప్రభుత్వ వాటాగా 49 శాతం ఉంచుకుని 51 శాతం వాటాతో పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజును భాగస్వామిగా చేర్చుకుని ప్రైవేటు యాజమాన్యం కింద ఫ్యాకరీలను నడిపారు. క్రమంగా పరిశ్రమ తన శోభను కోల్పోవడం ప్రారంభమైంది. 2004లో జరిగిన అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన శాసనమండలి కమిటీ నిజాం షుగర్స్ కర్మాగారాలను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నివేదిక అందజేసింది. కానీ తదనంతరం జరిగిన పరిణామాలతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2014లో జరిగిన తెలంగాణ తొలి ఎన్నికల సందర్భంగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో నిజాం షుగర్స్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

వీధిన పడిన ఉద్యోగులు

తెలంగాణలో తొలిసారి ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో నిజాం షుగర్స్‌ను ప్రభుత్వ హయాంలో నడిపిస్తామని ప్రకటించింది. మూడేళ్లుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. కార్మికుల ఆశలు చిగురిస్తున్న సమయంలోనే 2015 డిసెంబరు 23వ తేదీ అర్ధరాత్రి నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను లేఆఫ్ ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధినపడ్డారు. దీంతో బోధన్‌లోని షక్కర్‌నగర్ యూనిట్, కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి, మెదక్ మంబోజిపల్లి కర్మాగారాల కార్మికులు, రైతులు ఫ్యాక్టరీలను ఏకపక్షంగా మూసేశారని ఉద్యమించారు. ఆందోళనలతో దిగివచ్చిన కార్మిక సంక్షేమశాఖ అధికారులు కార్మికులతో చర్చలు జరిపారు. చర్చల నివేదికను ప్రభుత్వానికి సమర్పించగా.. కేసును 2017 ఆగస్టులో లేబర్ కోర్టుకు అప్పగించి లే-ఆఫ్‌పై విచారణ ప్రారంభించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సెప్టెంబరులో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. నిజాం షుగర్స్ లిక్విడేషన్‌కు ట్రిబ్యునల్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పటి ప్రభుత్వం ఢిల్లీ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. అక్కడ విచారణ కొనసాగుతోంది.

ఎనిమిదేళ్ల క్రితమే హామీ

ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి తెలుగుదేశం నేత రేవంత్‌రెడ్డి ఎనిమిదేళ్ల క్రితం మెదక్ మంబోజిపల్లిలో నిజాం షుగర్స్ కర్మాగారం ఎదుట కార్మికుల ఆందోళనలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని అప్పటి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం ఆయన సీఎం కావడంతో నిజాం షుగర్స్‌పై ఆశలు చిగురించాయి. తాజాగా అసెంబ్లీలో ప్రకటనతో పరిశ్రమకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నారు.

ఇథనాల్ ఉత్పత్తికి ప్రోత్సాహకాలు

చక్కెర తయారీ ప్రక్రియలో బైప్రొడక్ట్‌గా ఈథైల్ ఆల్కహాల్ వస్తుంది. కేంద్ర ప్రభుత్వం రాబోయే రోజుల్లో పెట్రోల్‌లో 20 శాతం మేర ఇథనాల్‌ను కలపాలని నిర్ణయించింది. ఇథనాల్ ఉత్పత్తి చేసే సంస్థలకు ప్రోత్సాహకాలు కూడా అందజేస్తోంది. దీంతో చక్కెర పరిశ్రమలు, ఇతర వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమల్లో ఉత్పత్తయ్యే ఇథనాల్‌కు డిమాండ్ ఉంది. ప్రస్తుతం సరిపడా ఇథనాల్ ఉత్పత్తి లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దిగుమతి చేసుకునే బదులు ఇక్కడి పరిశ్రమలనే తిరిగి ప్రారంభించాల్సిందిగా కార్మికులు కోరుతున్నారు.

పోరాటస్ఫూర్తిని చాటిన దుబ్బాక

- గత ఎన్నికల్లో జరిగిన తప్పిదానికి ఇక్కడి ప్రజలు వడ్డీతో సహా 54వేల మెజార్టీ ఇచ్చారు
- మాయమాటలతో ఒక్కసారే మోసం చేయగలరు
- దుబ్బాక ప్రజల రుణం తీర్చుకోలేనిది
- పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవాలి
- కృతజ్ఞత సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు

దుబ్బాక, జనవరి 2: తెలంగాణ ఉద్యమంలో అరెస్టులు, పోరాటాలు జరిగాయంటే దుబ్బాకనే... పోరాటాల పురిటిగడ్డ దుబ్బాక, ఆ స్ఫూర్తిని నిలబెట్టుకుందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దుబ్బాక ప్రజలు గత ఎన్నికల్లో జరిగిన తప్పిదానికి వడ్డీతో సహా 54వేల మెజార్టీతో గులాబీ జెండాను ఎగురవేశారని తెలిపారు. మంగళవారం దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ, నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడారు. దుబ్బాక ప్రజల రుణం తీర్చుకోలేదని, మాట నిలబెట్టుకున్న ప్రజలకు జన్మజన్మలా రుణపడి ఉంటానని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట కంటే ముందే దుబ్బాక నడిచేదన్నారు. తనకు వెన్నుగా నడిచిన దుబ్బాక ఉప ఎన్నికల్లో పరిస్థితి తనను చాలాకాలం బాధపెట్టిందన్నారు. ఈ ఎన్నికల్లో వడ్డీతో సహా తిరిగి ఇచ్చారని, దుబ్బాక గులాబీ కంచుకోట అని మరోసారి నిరూపించారన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై కత్తిపోటు జరిగిన తర్వాత పరామర్శించడానికి వెళ్తే తాను ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పాడన్నారు. తాను సముదాయించి సిద్దిపేట నుంచి వచ్చిన కార్యకర్తలు, దుబ్బాక ప్రజలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తామని నచ్చజెప్పానన్నారు. ప్రతీ కార్యకర్త కసితో పనిచేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యకర్తల కార్యదీక్షతోనే దుబ్బాకలో భారీ మెజార్టీ సాధించగలిగామని స్పష్టం చేశారు. మాయమాటలు, మోసపూరిత హామీలు ఎల్లకాలం సాగవని ఇక్కడి ప్రజలు నిరూపించారని హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం రాకున్నా, కార్యకర్తలు బాధపడవద్దన్నారు. ప్రస్తుతం మనకు స్పీడ్ బ్రేకర్ మాత్రమేనన్నారు. తప్పులు జరిగితే సవరించుకుని ముందుకు సాగుతామని, కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు. ఇదేమి బీఆర్ఎస్‌కు కొత్తకాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని కాని ఇప్పటి వరకు ఏదీ నెరవేరలేదన్నారు. మాటనిలబెట్టుకోని కాంగ్రెస్‌ను, తెలంగాణ ప్రయోజనాలే పట్టని బీజేపీని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోగా ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే తగిన బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కలిసికట్టుగా నిలబడి, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు వివరించాలన్నారు. వీధుల్లో, పండుగల్లో, ఫంక్షన్లలో చర్చపెట్టాలని సూచించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడే పార్టీ కేవలం బీఆర్ఎస్ మాత్రమే అని ప్రజలకు వివరించాలన్నారు. భవిష్యత్తు మనదేనని, అంతిమ విజయం కూడా మనదేనన్నారు. మరో ఆరు నెలల తర్వాత ప్రజలు మన మంచితనం గుర్తిస్తారని చెప్పారు. ఇప్పటికే కొద్దికొద్దిగా అర్థం అవుతుందని, మరో ఆరు నెలల్లో మొత్తం బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు. -తెలంగాణ ప్రయోజనాలు ఢిల్లీలో వినిపించే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలల్లో ఎక్కువ స్థానాలను గెలిచి తీరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నాయకులు ఆర్, రాజమౌళి, వెంకటనర్సింహారెడ్డి, కత్తికార్తికా గౌడ్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామకమిటి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

5లోగా మల్లన్న కల్యాణ ఏర్పాట్లు పూర్తవ్వాలి

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనుల్లో జాప్యంపై ఆగ్రహం


తోటబావి ప్రాంగణంలోని కల్యాణవేదిక వద్ద తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

చేర్యాల, జనవరి 2: కొమురవెల్లి మల్లన్న కల్యాణ ఏర్పాట్లన్నీ ఈనెల 5వ తేదీలోగా పూర్తిచేయాలని, ఆయా పనుల్లో నిర్లక్ష్యం వహించకూడదని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని సందర్శించి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభుత్వశాఖల వారీగా తీసుకోవాల్సిన ఏర్పాట్లు, చర్యలపై సూచనలు చేశారు. కల్యాణం జరిగే ఆలయ తోటబావి ప్రాంగణం, దర్శన క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలతో ఆలయ పరిసరాలు, 50 గదుల సత్రం, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ సమీపంలోని పీహెచ్‌సీని పరిశీలించి వైద్యసేవల నిర్వహణపై సూచనలు చేశారు. అదనంగా వైద్యులు, సిబ్బందిని ఏర్పాటుచేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో కాశీనాథ్‌కు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, కల్యాణ వేదిక వద్ద భక్తుల తోపులాట నెలకొనకుండా పటిష్ట బందోబస్తు చేపట్టాలని సూచించారు. వీఐపీ, వీవీఐపీలకు సంబంధించిన పాసులను సమన్వయంతో పంపిణీ చేయాలన్నారు. 24గంటల పాటు విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలని సూచించారు. భక్తులకు వైద్యసేవల నిర్వహణకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటుచేయాలన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్‌భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈనెల 5న తాను మళ్లీవచ్చేసరికి ఏ పని కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఆలయ పరిసరాలలో చెత్తా,చెదారం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, పారిశుధ్య కార్మికులు డ్రెస్‌కోడ్ పాటించాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచే యాలని, అన్నిశాఖల అధికారులు, మొబైల్ నంబర్లతో సహా జాబితా రూపొందిచాలని తెలిపారు.

తాత్కాలిక క్యూలైన్ల సంఖ్యను పెంచాలి

రూ.11కోట్ల వ్యయంతో ఆలయ ప్రాంగణంలో చేపట్టిన క్యూకాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో కలెక్టర్ పాటిల్ అసహనం వ్యక్తంచేశారు. ఈవిషయమై కాంట్రాక్టర్ రాములును తనవద్దకు పిలవాలని ఈవో బాలాజీని ఆదేశించారు. తాత్కాలిక క్యూలైన్ల సంఖ్యను పెంచాలని, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. 50 గదుల సత్రం భవనం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని పంచాయత్‌రాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు.

బెల్ట్‌షాపులను మూయించాలి

ఆలయ పరిసరాలతో పాటు చుట్టుపక్కల మద్యం విక్రయించే బెల్టుషాపులను వెంటనే మూసేయించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మూర్తిని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పాటుపడాలని తెలిపారు. కలెక్టర్ వెంట అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, జడ్పీటీసీ సిలివేరు సిద్ధప్ప, డీఎంఅండ్‌హెచ్‌వో కాశీనాథ్, ఏసీపీ సతీశ్, తదితరులు ఉన్నారు.


గొల్ల కురుమల సంప్రదాయం ప్రకారం కల్యాణం జరిపించాలి

పంజాగుట్ట, జనవరి 2 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని గొల్ల కురుమల బండారు(పసుపు) సంప్రదాయం ప్రకారం జరిపించాలని తెలంగాణ గొల్ల కురుమ సంఘం, ఓయూ విద్యార్థి నాయకుడు కురుమ శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓయూ జేఏసీ నాయకుడు ఎం.చంద్రశేఖర్ యాదవ్, సంతోష్‌యాదవ్, ప్రసాద్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తమ తాత, ముత్తాతల కాలం నుంచి వంశపారంపర్యంగా వచ్చే బండారు(పసుపు)సంప్రదాయం ప్రకారం మల్లన్న కల్యాణాన్ని నిర్వహించే వారన్నారు. 30 సంవత్సరాలుగా ఆగమశాస్త్రం అని చెప్పి విభూతితో పూజలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయమై పలుమార్లు సంబందిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. అలాగే ఆలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.



హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కురమ శ్రీశైలం

చలికాలం.. జీవాలు పైలం


పచ్చిక మేస్తున్న గొర్రెలు, మేకలు (ఫైల్)

చిన్నకోడూరు, జనవరి 2: రోజు రోజుకు పెరుగుతున్న చలితో ప్రజలతో పాటు జీవాలూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అయితే చలి వల్ల మేకలు, గొర్రెల్లో పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ సమయంలో పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారిణి మంజుల సూచిస్తున్నారు.

జలుబు, దగ్గు

జీవాలకు జలుబు, దగ్గు సోకినప్పుడు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారుతుంది. చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. జీవాల పాక ఇరుకుగా ఉండటం, గాలి సరైన వెలుతురు లేక, అదేవిధంగా తడి, తేమ ఎక్కువగా ఉండటం, కాలుష్యం, దుమ్ము వాతావరణంలో ఆకస్మాత్తుగా వచ్చే మార్పులు వీటికి కారణమవుతాయి. క్రిముల ద్వారా సోకే అంటువ్యాధులతో ఆహారం ద్వారా శ్వాస కోశంలోకి వచ్చే కణాలు జలుబు, దగ్గుకు కారణమవుతాయి. వీటి నివారణకు పాకలోకి గాలి, వెలుతురు సరిగా వచ్చే విధంగా చూడాలి. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచుకోవాలి.

షీప్ ఫాక్స్

షీప్‌ఫాక్స్ ఇది గొర్రెలకు మాత్రమే వచ్చే వ్యాధి. ఈ వ్యాధి సోకిన జీవాలకు చర్మంపై దద్దుర్లు వస్తాయి. జ్వరం తీవ్రంగా ఉండటం, మేత మేయకపోవడం ఈ వ్యాధి లక్షణాలు.

పెంపకందారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- మంజుల, మండల పశువైద్యాధికారి, చిన్నకోడూరు



చలికాలం జీవాల విషయంలో పెంపకందారులు ఎక్కువగా శ్రద్ధ వహించాలి. జీవాలు చలికి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమైనా వ్యాధులు సోకితే సొంత వైద్యం చేయకుండా పశు వైద్యాధికారులను సంప్రదించాలి.

నెట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపక బృందం

గజ్వేల్‌టౌన్, జనవరి 2: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపి తెలిపారు. గత డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు నల్గొండ జిల్లాలో జరిగిన జూనియర్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్, ఫాస్ట్ (5)నెట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ మోడల్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులు శ్రీవాణి, సరిత, రసజ్ఞ ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు కాంస్య పతకాలు గెలుపొందారని పేర్కొన్నారు. క్రీడాకారులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

హవేళిఘణపూర్, డిసెంబరు 2 : ప్రజలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మండల పరిధిలోని బ్యాతోల్‌లో మండళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల చెంతకు వెళ్లి పాలనను అందిస్తుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించవచ్చన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెల 6వ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తసీల్దార్ నారాయణ, సర్పంచ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.







హవేళీఘణపూర్ మండలం బ్యాతోల్‌లో దరఖాస్తును స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా, వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామంలో స్వీకరిస్తున్న ఆవుల రాజిరెడ్డి, చిన్నశంకరంపేట మండలం మడూర్‌లో అధికారులకు దరఖాస్తులను అందజేస్తున్న ప్రజలు

ప్రజాపాలనకు మంచి స్పందన : ఆర్డీవో

నర్సాపూర్, జనవరి 2: నర్సాపూర్ డివిజన్‌లో ప్రజాపాలనకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నర్సాపూర్ మున్సిపాలిటీతో పాటు ఆయా మండలాల్లో ఇప్పటివరకు 16,014 దరఖాస్తులు వచ్చాయన్నారు. మున్సిపల్ పరిధిలో వార్డుల వారిగా కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తుంటే, గ్రామాల వారిగా నిర్దేశించిన తేదీలలో కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఇదివరకే పింఛన్, భూమికి పెట్టుబడిసహాయం అందుతుంటే వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరము లేదని సూచించారు.

పకడ్బందీగా అమలు

నర్సాపూర్, జనవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేయడానికే ప్రజాపాలన కార్యక్రమం చేపట్టినట్లు మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తెలిపారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి, జక్కపల్లి, తుజాల్‌పూర్, తిర్మలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ జ్యోతిసురేష్ ఎంపీడీవో మార్టిన్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, సర్పంచులు ఉన్నారు.

పేదల సంక్షేమం కోసమే ప్రజాపాలన

వెల్దుర్తి, జనవరి 2 : పేదల సంక్షేమం కోసమే ప్రజాపాలన గ్రామసభలను నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మండల పరిధిలోని రామాయిపల్లి, దామరంచ, శెట్టిపల్లిలోనూ అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

రేగోడు జనవరి 2: ఆరు గ్యారంటీల పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని జడ్పీటీసీ యాదగిరి అన్నారు. మండలంలోని పోచారం, దోసపల్లి, గజవాడ, ప్యారారంలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. పోచారం, గజవాడలో మెదక్ డీపీవో సాయిబాబా దరఖాస్తులను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి నర్సింగ్‌రావు, తహసీల్దార్ బాలలక్ష్మి, ఎంపీడీవో సీతారావమ్మ, సర్పంచులు పాల్గొన్నారు.

గడువులోగా గ్యారంటీల అమలు

జిన్నారం, జనవరి 2: కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హమీలలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాలను నిర్ధిష్ట గడువులోగా పూర్తి చేస్తుందని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 2, 5వ వార్డులలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో చైర్మన్‌తో కలిసి పాల్గొన్నారు. కాగా సోలక్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తు నింపి ప్రభుత్వ సాయం పొందాలి

గుమ్మడిదల జనవరి 2 : దరఖాస్తులను పూర్తిస్థాయిలో నింపి అధికారులకు అప్పజెప్పి, ప్రభుత్వ సాయం పొందాలని ఎంపీపీ సద్ది ప్రవీణభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ కోరారు. మండలంలోని అనంతారం, కానుకుంటలో ప్రజాపాలన కార్యక్రమానికి వారు హాజరై దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, కార్యదర్శులు సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పలుచోట్ల ప్రజాపాలన గ్రామసభలు

సంగారెడ్డి రూరల్ : సంగారెడ్డి మండలం ఫసల్వాదీలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం దరఖాస్తులను స్వీకరించారు. 457 దరఖాస్తులు రాగా, రేషన్‌కార్డులు, ధరణి సమస్యలపై 37 అందాయి. సంగారెడ్డి ఎంపీడీవో రవీందర్, ఎంపీటీసీ శారద, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంగారెడ్డిలో ఆర్డీవో నగేష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.

- చిన్నశంకరంపేట : చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. దరఖాస్తు ఫారాన్ని నింపే విధానాన్ని తెలిపారు. ఈ పథకాలు నిరంతరం కొనసాగుతాయని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ విజయశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నర్సమ్మ పాల్గొన్నారు.
- మనోహరాబాద్ : మనోహరాబాద్, రామాయిపల్లి, రంగాయపల్లి, వెంకటాపూర్, అగ్రహారం గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాపాలనను జడ్పీ సీఈవో వెంకట్ శైలేష్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీటీసీ లతావెంకట్, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.
- జహీరాబాద్ : జహీరాబాద్ మండలంలోని మల్‌చెల్మ, హోతి(బి), మొగుడంపల్లి మండలంలోని మొగుడంపల్లి, మన్నాపూర్ గ్రామాల్లో, జహీరాబాద్ పట్టణంలోని శ్రీరాంమందిర్, ఆర్యసమాజ్ ప్రాంతాల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. సాయంత్రం వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.





గుమ్మడిదల మండలం కానుకుంటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ సద్ది ప్రవీణభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, జహీరాబాద్ పట్టణంలో దరఖాస్తు కౌంటర్ వద్ద రద్దీ



టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కొండల్‌రెడ్డి

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 2: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై అడ్డంకులను తొలగించి ప్రభుత్వం వెంటనే షెడ్యూల్ ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలన్నారు. ఉపాధ్యాయుల కొరత ఏర్పడే పాఠశాలలకు వర్క్ అడ్జెస్టెమెంట్ కింద టీచర్లను కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలతోపాటు బిల్లులను చెల్లించాలన్నారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంగయ్య, వెంకట్రామిరెడ్డితో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు శశిధర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు మధుసూదన్‌రెడ్డి, హీరాలాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఒరిజినల్ ఆధార్‌కార్డు చూపాల్సిందే

- లేదంటే టికెట్ తీసుకోవాలి : సంగారెడ్డి డీఎం ఉపేందర్

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డును చూపి ఉచితంగా ప్రయాణించాలని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు లేకపోతే టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా ప్రయాణికులు తమ వెంట రీసెంట్ అప్‌డేటెడ్ ఒరిజినల్ ఆధార్‌కార్డు ఉంచుకోవాలన్నారు. కండక్టర్ అడిగిన వెంటనే చూపిస్తే సరిపోతుందన్నారు. జిరాక్స్ ప్రతి, ఫోన్‌లో చూపించకుండా ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించాలని ఆయన స్పష్టం చేశారు.

గ్రామాల అభివృద్ధికి పరిశ్రమలు సహకరించాలి

జిన్నారం, జనవరి 2: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పరిశ్రమలు సహకరించాలని గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశంచారి అన్నారు. మంగళవారం గడ్డపోతారం పంచాయతీ దాచారంలో లాజరస్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను సర్పంచ్ ప్రకాశంచారి ప్రారభించారు. పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారంలో పారిశ్రామిక వేత్తలు సహకరించాలని ఆయన కోరారు. లాజరస్ పరిశ్రమ సహకారంతో పంచాయతీ పరిధిలో రూ.10 లక్షలతో నాలుగు వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాసెట్టిగారి రాజు, వార్డు సభ్యులు వీరేశం, నాయకులు నర్సింగ్‌రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.



దాచారంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ప్రకాశంచారి

వరద కాలువ ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

జిన్నారం, జనవరి 2: జిన్నారం అక్కమ్మ చెరువు వరద కాలువను ఆక్రమించి పరిశ్రమ చేపట్టిన పనులు పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం జిన్నారం శివారులోని కొచ్చెరువు సమీపంలోని వరద కాలువపై గోయల్ పరిశ్రమ చేపట్టిన పనులు సెక్రటరీ లక్ష్మీకాంత్‌రెడ్డి అడ్డుకున్నారు. చెరువుకు సహజ వర్షపు నీరు తరలించే వరద కాలువను పూడ్చివేసి పైపులు వైయటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా వరద కాలువ ఆక్రమణపై ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్‌కు, ఇరిగేషన్ అధికారులకు పిర్యాదు చేశారు.

గ్రామానికి అంబులెన్స్ సమకూర్చిన సర్పంచ్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఇస్లాంపూర్ సర్పంచ్

తూప్రాన్, జనవరి 2 : మండలంలోని ఇస్లాంపూర్ గ్రామ సర్పంచ్ జంగం సుకన్యరమేష్ ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు కొంతకాలంగా తన కారును ఇస్తూ వస్తున్నారు. అంబులెన్స్ సమకూర్చితే సమస్య తీరుతుందని భావించి ఏకంగా అంబులెన్స్‌ను కొనుగోలు చేశాడు. మంగళవారం ఇస్లాంపూర్ గ్రామపగుట్టపై పురోహితుడు ఆత్రేయ శర్మతో పూజలు నిర్వహించి అంబులెన్స్ అందజేశాడు.

సేవాలాల్ క్రికెట్ ట్రోఫీ విజేతగా పల్లూర్‌తండా జట్టు

జహీరాబాద్, జనవరి 2 : మండలంలోని ఆనెగుంట గ్రామంలో సేవాలాల్‌పేరిట నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరగగా పట్లూర్ తండా సీసీజట్టు విజేతగా నిలిచింది. పట్లూర్‌జట్టుకు రూ.35వేల చెక్‌ను, ట్రోఫీని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, నిర్వాహకులు అందజేశారు. రన్నర్‌గా నిలిచిన లచ్చునాయక్‌తండా జట్టుకు రూ.20వేల నగదును ఇచ్చారు.

ముగిసిన మల్లన్న ఆలయ వార్షికోత్సవాలు

నర్సాపూర్, జనవరి 2: నర్సాపూర్ సమీపంలోని మల్లన్న ఆలయ వార్షికోత్సవాలు యాదవ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరిరోజైన మంగళవారం ప్రత్యేక పూజలతో ముగిశాయి. దేవతపూజ, నాగవెల్లి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు మల్లన్న చరిత్రను కథరూపాన్ని ప్రదర్శించారు.



మల్లన్న కథను చెబుతున్న ఒగ్గు కళాకారులు

భక్తులకు అయోధ్య అక్షింతల పంపిణీ

నారాయణఖేడ్, జనవరి 2: అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించనున్న ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన అక్షింతలు ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని హనుమాన్ ఆలయంలో అందుబాటులో ఉంచారు. మంగళవారం మండలంలోని వెంకటాపూర్ మాజీ సర్పంచు అంజయ్య, ఉప సర్పంచు సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నారాయణ, కురుమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్గొండతో పాటు భక్తులు ఆలయానికి వచ్చి అక్షింతలను గ్రామానికి తీసుకెళ్లారు.

దీపాదాస్‌కు శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ సభ్యుడు

నారాయణఖేడ్, జనవరి 2: కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియామకమైన ఏఐసీసీ నేత దీపాదాస్‌మున్షిని మంగళవారం టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ హైదరాబాద్‌లో కలిశారు. దీపాదాస్ మున్షి బాధ్యతలు చేపట్టాక మొదటిసారి రావడంతో ఆయన ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మైనంపల్లిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట, జనవరి 2: చిన్నశంకరంపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావును కలిశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు పవన్‌గౌడ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు చేసే సేవతో మోక్షం

- బాల్కి పీఠాధిపతి గురు బసవ పట్టదేవరు

కంగ్టి, జనవరి 2: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు సేవ చేయడంలోనే దైవభక్తి దాగి ఉందని, ఫలితంగా మోక్షం ప్రాప్తిస్తుందని కర్ణాటకలోని బాల్కి పీఠాధిపతి గురు బసవ పట్టదేవరు పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని నాగూర్.బిలో బసవ లింగ పట్టదేవర మాతృమూర్తి భగీరథీబాయి సంస్మరణోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట, జనవరి 2: ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే వ్యవసాయ సాగుకు పిచికారీ చేసే ఎరువులు, మందులపై ఏఈవోలు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దశంకరంపేటలో వికసిత్ భారత్ యాత్ర

పెద్దశంకరంపేట, జనవరి 2: జనవరి 3 నుండి 16 వరకు పెద్దశంకరంపేట మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ తెలిపారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరువ చేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్

నర్సాపూర్, జనవరి 2: నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ మంగళవారం జిల్లా కేంద్రం మెదక్‌లోని కలెక్టరేట్ భవనంలో కలెక్టర్ రాజర్షిషాను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో ప్రజాపాలన కార్యక్రమంపై కలెక్టర్ ఆరా తీశారని కమిషనర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా కార్యక్రమం నిర్వహించాలని సూచించారని చెప్పారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

రేగోడ్ జనవరి 2: విద్యుత్ సమస్యలపై బుధవారం రేగోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సదస్సును ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ యాసిన్ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు

నారాయణఖేడ్,జనవరి 2: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం రాత్రి నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే మెజార్టీ కౌన్సిలర్లను గెలుపొందినప్పటికీ, అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అనైతికంగా ఎక్స్అఫీషియో సభ్యులతో ఆ పార్టీకి చెందిన వారిని చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నుకున్నారన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ చేపడుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు మాజీద్, నర్సింలు, సంధ్యారాణిరామకృష్ణకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన తుకారం, జమీర్, కిష్టయ్య, మహ్మద్, యూనుస్, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం వారు జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్‌ను సైతం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, హన్మంతు, యూసుఫ్, సుబురు, యాదుల్, మోయిన్, సేవాలాల్ సంఘం నాయకులు రమేష్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

ఖేడ్ మున్సిపాలిటీలో మారిన బలాబలాలు

- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి కాంగ్రెస్ యత్నం

నారాయణఖేడ్ మున్సిపాలిటీలో 15 వార్డులకు కాంగ్రెస్‌కు ఎనిమిది, బీఆర్ఎస్‌కు ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. మెజార్టీ కాంగ్రెస్‌కే ఉన్నప్పటికీ అప్పట్లో ఎక్స్అఫీషియో సభ్యులు కీలకంగా మారాయి. వారి ఓట్లతో బీఆర్ఎస్ మున్సిపల్ పీఠాన్ని దక్కించుకున్నది. వారితో పాటు అప్పట్లో కాంగ్రెస్ నుంచి ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. 15వ వార్డు నుంచి గెలుపొందిన రుబీనాబేగంను జీబ్‌ను చైర్మన్‌గా, ఐదో వార్డు నుంచి గెలుపొందిన అహీర్‌పరశురాంను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఖేడ్ మున్సిపాలిటీలో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కాంగ్రెస్‌లో పార్టీలో చేరడంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య పదికి చేరింది. దీంతో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టి, బీసీ జనరల్‌గా ఉన్నందున ఆరో వార్డు నుంచి గెలుపొందిన ఆనంద్ స్వరూప్‌షెట్కార్‌ను చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందించేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తుంది.

కాంగ్రెస్ ఇచ్చిన ఇళ్ల స్థలాలను బీఆర్ఎస్ రద్దు చేసింది

- పదేళ్లు మౌనం వహించి ఇప్పుడు అడుగుతున్నారా?
- డీసీసీ అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి

సదాశివపేట, జనవరి 2: కాంగ్రెస్ ఇళ్ల స్థలాలు అందిస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని డీసీసీ అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి గుర్తుచేశారు. మంగళవారం సదాశివపేట పట్టణంలోని 11వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నిర్మలాజగ్గారెడ్డిని ఆ వార్డు బీజేపీ కౌన్సిలర్ ఓదెల రాజేశ్వరి ఇళ్ల స్థలాల విషయంలో ప్రశ్నించారు. 2013 సంవత్సరంలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి పట్టణంలో 5వేల మందికి ఇంటి పట్టా సర్టిఫికేట్లు పంపిణీ చేశారే తప్పా స్థలాలు చూపించలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని 5వేల మందికి ఎప్పుడు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. స్పందించిన నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. చేసేదే చెప్పడం, చెప్పిందే చేయడమే జగ్గారెడ్డికి తెలుసునన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలను రద్దు చేసిందని మండిపడ్డారు. 2018లో జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినా రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండి సంగారెడ్డి నియోజకవర్గంలో ఏపని కాకుండా అడ్డుపడిందని తెలిపారు. ఇళ్ల స్థలాల విషయంలో పదేళ్ల పాటు మౌనం వహించి ఇప్పుడెందుకు అడుగుతున్నారని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ వాస్తవాలను, బీఆర్ఎస్ పాపాలను దాచిపెట్టి కేవలం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని మాత్రమే బద్నాం చేసే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ప్రకటించిన 6 గ్యారెంటీలను తప్పకుండా అమలు చేసి పేద ప్రజల ఆశీర్వాదం తీసుకుంటామని నిర్మలాజగ్గారెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం ఆమె ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు.



మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి

మంత్రికి వినతుల వెల్లువ

నారాయణఖేడ్, జనవరి 2: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం నారాయణఖేడ్‌కు రావడంతో వివిధ సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్ గత పాలనలో హెల్త్ డైరెక్టర్‌గా వ్యవహరించిన గడల శ్రీనివాస్‌పై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించాలని మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. అంతే కాకుండా గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్‌జయంతి అయిన ఫిబ్రవరి 15న సెలవు దదినంగా ప్రకటించాలని, గిరిజను సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. నారాయణఖేడ్ మండలం పిప్రికి చెందిన సంగీత తాను కరోనా సమయంలో గర్భిణిగా ఉన్నప్పటికీ, నిలోఫర్ వైద్యశాలలో ఏఎన్ఎంగా సేవలు అందించినా తనకు మార్కులు కలుపలేదని, న్యాయం చేయాలని కోరారు. కాగా కాంగ్రెస్ హయాంలో ఆదర్శ రైతుల విధానం అమల్లో ఉందని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎత్తి వేసిందని, తిరిగి ఆదర్శ రైతుల విధానాన్ని కొనసాగించాలని పలువురు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. వైద్య సిబ్బంది పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు.



నారాయణఖేడ్‌లో మంత్రి దామోదర్‌కు వినతిపత్రం ఇస్తున్న లంబాడ హక్కుల పోరాటసమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్

మంత్రిని కలిసిన టీఎన్జీవో సభ్యులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 : నూతన సంవత్సరం సందర్భంగా టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, కార్యదర్శి శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింలు, నిర్మలరాజకుమారి, మమత, సుధామణి, గౌస్, శ్రీనివాస్, భాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జనవరి 2 : సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఎ.శరత్, జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావులను కలిశారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

సంగారెడ్డి టౌన్, జనవరి 2 : సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పంచాయతీరాజ్ ఈఈ జగదీష్, ఏఈలు దీపక్‌కుమార్, కృష్ణ, కంది జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ జి.శ్రీహరి, ఆరుట్ల రాంరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, వీరయ్య తదితరులు ఉన్నారు.

అందోలు అభివృద్ధిలో రాజకీయాలు తగదు

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సంగారెడ్డి టౌన్, జనవరి 2 : అందోలు నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ రాజకీయాలు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. సంగారెడ్డిలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన హయాంలో నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ, పంచాయితీరాజ్, పీఎంజీఎస్‌వై తదితర పథకాల కింద మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో రూ.60కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద రూ.30కోట్లు మంజూరు చేయించానని వివరించారు. ఈ పనులను మంత్రి దామోదర్ కుట్రపూరితంగా నిలిపివేయడం అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. రాజకీయ కక్ష సాధింపుతో అడ్డుకుంటే ఆందోళన చేస్తామని క్రాంతికిరణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాసానిపల్లి నారాయణ, సాయికుమార్, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడిగా సిద్ధిఖ్

సంగారెడ్డి రూరల్, జనవరి 2 : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఎలాక్ట్రానిక్ మీడియా సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎండీ సిద్ధిఖ్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆసీఫ్‌అహ్మద్ ప్రకటించారు. సంగారెడ్డిలో మంగళవారం సిద్ధిఖ్‌ను టీయూడబ్ల్యూజే నాయకులు, తోటి జర్నలిస్టులు సన్మానించి అభినందించారు. తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నన కమిటీ నాయకులకు సిద్ధిఖ్ ధన్యవాదాలు తెలిపారు.